వైకుంఠధామం.. వసతులు శూన్యం



మన్నాపూర్‌లో నిర్మించిన వైకుంఠధామం

- కనీస వసతుల కల్పనలో అధికారుల నిర్లక్ష్యం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కొత్తపల్లి: ఎవరైనా మరణిస్తే అంత్యక్రియల నిర్వహణకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పల్లెల్లో వైకుంఠధామాలు నిర్మించింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం వాటిని పట్టించుకోకపోవడంతో చాలా చోట్ల పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాలేదు. అలాగే అనేక శ్మశానవాటికల్లో కనీస సౌకర్యాలు లేక నిరుపయోగంగా మారాయి. నియోజకవర్గంలోని నాలుగు మండలాలు అయిన కోస్గిలో14, మద్దూరులో 24, కొత్తపల్లిలో 16, గుండుమాల్‌లో 13 మొత్తంగా 67 వైకుంఠదామాలు ఉన్నాయి. రూ.లక్షలు వెచ్చించి భవనాలు, దహన వేదికలు నిర్మించినా అధికారులు, ప్రజాప్రతినిధులు వినియోగంలోకి తీసుకురాకపోవడంతో అంతిమ వీడ్కోలకు కూడా ప్రజలు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుంది.

బోరు బావులు, నీటి కుంటలే దిక్కు..

అంత్యక్రియల అనంతరం స్నానం చేసేందుకు, ఇతర అవసరాలకు నీరు తప్పనిసరి. కానీ చాలా వైకుంఠధామాల్లో బోర్లు వేయకపోవడం, వేసినా నీరు పడకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో అనేక శ్మశాన వాటికల్లో అంత్యక్రియల తర్వాత స్నానాల కోసం పక్కనే ఉన్న బోరుబావులు, కుంటలపై ఆధారపడవలసి వస్తోంది. అలాగే అనేక చోట్ల విద్యుత్‌ కనెక్షన్లు లేకపోవడం ఉన్నా సాంకేతిక కారణాల కారణంగా విద్యుత్‌ వెలుగులు కరువయ్యాయి. దీంతో రాత్రి సమయాల్లో అంత్యక్రియలు నిర్వహించాల్సి వచ్చినప్పుడు గ్రామస్తులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

ఎటుచూసినా కంపచెట్లే..

కొన్ని చోట్ల వైకుంఠధామాల చుట్టూ కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగిపోయి ఆ ప్రాంతం అంతా అపరిశుభ్రంగా మారింది. లోపలికి వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. కొన్ని గ్రామాల్లో వైకుంఠధామాలను ఊరికి చాలా దూరంలో నిర్మించారు. దీంతో ప్రజలు మళ్లీ పాత శిఖం భూములు, వాగులు, గట్లపైన అంత్యక్రియలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అధికారులు చర్యలు తీసుకోవాలి



వైకుంఠధామాల్లో వసతుల కల్పనపై పంచాయతీ అధికారులు దృష్టి పెట్టాలి. గత ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు పెట్టి భవనాలు నిర్మించింది. ప్రస్తుత ప్రభుత్వం నీళ్లు, కరెంటు, ఇతర సౌకర్యాలు కల్పించి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెస్తే గ్రామస్తులకు ఉపయోగకరంగా ఉంటుంది. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

–మధుసూదన్‌ రెడ్డి, మన్నాపూర్‌

స్థానిక ఎన్నికలు నిర్వహించాలి



మండలకేంద్రంలో నిర్మించిన వైకుంఠధామాలను అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. అదే ప్రభుత్వం స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే పంచాయతీ పాలన పగ్గాలు చేపట్టే నాయకులు సౌకర్యాల కల్పనపై దృష్టి పెడతారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి.

– సుధాకర్‌ రెడ్డి, కొత్తపల్లి బీజేపీ మాజీ అధ్యక్షుడు

సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న 108 సిబ్బంది

ధన్వాడ: గుండెపోటుకు గురైనప్పుడు సీపీఆర్‌ ఎలా చేయాలి అనే దానిపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఈఎంటీ భరత్‌కుమార్‌ తెలిపారు. గురువారం జీవీకే ఈఎంఆర్‌ఐ 108 వారి ఆధ్వర్యంలో ధన్వాడ ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. గుండెపోటు వచ్చినప్పుడు వెంటనే సీపీఆర్‌ చేయాలని ఛాతిపై రెండు చేతులతో బలంగా నొక్కుతూ నోటితో శ్వాస అందించాలని వివరించారు. 108 జిల్లా మేనేజర్‌ రాఘవేందర్‌, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ శ్రీనివాసులు, ఆంజనేయులు, సిబ్బంది ఆనంద్‌, రాజు, భీంరెడ్డి, లక్ష్మీనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతు



జేసీబీతో పనులు చేయిస్తున్న గ్రామస్తులు

ధన్వాడ: మండలంలోని కొండ్రోన్‌పల్లి–గోటూర్‌కు వెళ్లే రోడ్డును గ్రామస్తులే బాగు చేసుకున్నారు. రోడ్డు మొత్తం కంకర తేలి గుంతలమయంగా మారడంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులే పడేవారు. ఈ క్రమంలో రోడ్డుకు మరమ్మతు చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. విసిగిపోయిన గ్రామస్తులు తలకొంత డబ్బు వేసుకొని సొంతంగా గుంతలను పూడ్చి రోడ్డును బాగు చేసుకున్నారు.

మంత్రుల పర్యటనను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్‌

నర్వ: మక్తల్‌ మండలంలోని సంగంబండ ప్రాజెక్టులో చేప పిల్లలను వదిలే కార్యక్రమానికి శుక్రవారం మంత్రి వాకిటి శ్రీహరి అలాగే ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహా హాజరవుతున్నారని ఈ కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు బీసం చెన్నయ్యసాగర్‌ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. మంత్రి వాకిటి శ్రీహరి సహకారంతో మండలంలో పాడైన అంతర్గత రహదారుల మరమ్మతుల నిమిత్తం ఎఫ్‌డీఆర్‌ నిధులు రూ. 35 లక్షలు మంజూరు అయ్యాయన్నారు. మొత్తం 11 పనులు మంజూరు కాగా రాయికోడ్‌ నుంచి కాట్రేవుపల్లికి రూ. 3.3 లక్షలు, లంకాల్‌ నుంచి ఉంద్యాలకు రూ.4.2 లక్షలు, కొత్తపల్లి నుంచి పెద్దకడ్మూర్‌కు రూ. 2.4 లక్షలు, రాంపూర్‌ నుంచి ఉందేకోడ్‌ వరకు రూ. 3.6 లక్షలు, కల్వాల్‌ నుంచి కర్నె వరకు రూ.3.6 లక్షలు, కల్వాల్‌ నుంచి ముస్లాయిపల్లి రూ.2.4 లక్షలు, నాగిరెడ్డిపల్లి నుంచి ఉంధ్యాలకు రూ.1.98 లక్షలు, చిత్తనూర్‌ గేట్‌ నుంచి ఉందేకోడ్‌కు రూ.3.6 లక్షలు, యాంకి నుంచి బెక్కర్‌పల్లికి రూ.1.81.8 లక్షలు, జక్కన్నపల్లి నుంచి సీపూర్‌కు రూ.3.6 లక్షలు, సీపూర్‌ నుంచి పెద్దకడ్మూర్‌కు రూ.3.9 లక్షలు మంజూరయ్యాయన్నారు. నిధులు మంజూరు చేయించిన మంత్రికి మండల ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. సమావేశంలో నాయకులు మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌ రెడ్డి, రాజారెడ్డి, కుర్వ మహేష్‌, సద్దల ఆంజనేయ రెడ్డి, సంజీవరెడ్డి, వెంకట్రామారెడ్డి, కొండప్ప,శేఖర్‌ రెడ్డి, గడ్డం నర్సింహా పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అభిషేకం



మక్తల్‌: మండలంలో వల్లభపురంలోని విఠల్‌ బాబా ఆశ్రమంలో గణపతి అధర్వ శీర్ష సహస్ర అభిషేకాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మొదట కృష్ణాపుష్కరం నీటిలో జలాభిషేకం అనంతరం ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆశ్రమం కార్యదర్శి రామలింగారెడ్డి, అభిషేక సమన్వయకర్త వినోద్‌కుమార్‌, మహిళలు తదితర భక్తులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నారాయణపేట టౌన్‌: ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్‌ చైర్మన్‌ నర్సయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పలు వార్డులలో పేరుకుపోయిన చెత్తను మున్సిపల్‌ కార్మికులతో శుభ్రం చేయించారు. అదే విధంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి రోగాలు దరి చేరవన్నారు. నారాయణపేటను స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దడంలో ప్రజలు పారిశుద్ధ్య కార్మికులకు సహకారం అందించాలన్నారు.

ఎస్సీ ధ్రువపత్రాలు మంజూరు చేయాలి

ఊట్కూరు: మాదాసి కుర్వ కులస్తులకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరుతూ గురువారం తహసీల్దార్‌ కార్యాలయ సూపరిండెంట్‌ రాఘవేందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాదాసి కుర్వ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకన్న మాట్లాడుతూ కుర్వ కులస్తులు సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని, ఎస్సీ కుల ధ్రువీకరణ అందించాలని కోరారు. నాయకులు తిప్పన్న, హనుమంతు, అంజప్ప, బాలరాజు, లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు ‘కల్యాణలక్ష్మి’ చెక్కుల పంపిణీ

మాగనూర్‌: మండలంలోని లబ్ధిదారులకు శుక్రవారం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌ చెక్కుల పంపిణీ చేయనున్నట్లు మాగనూర్‌ ఇన్‌చార్జి తహసీల్దార్‌ సురేశ్‌కుమార్‌ తెలిపారు. మండల పరిషత్‌ కార్యాలయంలో మధ్యాహ్నం నిర్వహించనున్న కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి హాజరై చెక్కులను అందజేస్తారన్నారు. లబ్ధిదారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు.

లబ్ధిదారులు హాజరు కావాలి

కృష్ణా: మండలంలోని హిందుపూర్‌ గ్రామంలో గల బసవేశ్వర కల్యాణ మండపంలో శుక్రవారం మధ్యాహ్నం మంత్రి వాకిటి శ్రీహరి చేతుల మీదుగా కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్‌ చెక్కులను అందచేయనున్నట్లు తహసీల్దార్‌ శ్రీనివాస్‌ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు తప్పక హాజరు కావాలని సూచించారు.

నేడు వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్‌ గ్రామంలో శుక్రవారం వరి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించనున్నట్లు మండల కాంగ్రెస్‌ అధ్యక్షుడు రాజప్పగౌడ, యువజన కాంగ్రెస్‌ అధ్యక్షుడు సర్వరాజ్‌ఖాన్‌ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండల కాంగ్రెస్‌ నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

పశువులకు గాలికుంటూ నివారణ టీకాలు



కొత్తపల్లి: ఉమ్మడి మండల పరిధిలోని పెదిరిపాడ్‌, రెనివట్ల, నాగంపల్లి, పల్లెర్ల, కొత్తపల్లి మండలంలోని గోకుల్‌నగర్‌ గ్రామాలలో పశువులకు గాలి కుంటూ టీకాలు వేశారు. పశువులకు రోగాలు వ్యాపించకుండా అన్నదాతలు ఈ టీకాలను వేయించాలని పశువైద్యాధికారిణి విశాల సూచించారు. కార్యక్రమంలో డాక్టర్‌ సవిత, దేవేందర్‌ (వీఏ) నాయక్‌ పలు గ్రామాల క్లస్టర్‌ల గోపాల మిత్రలు పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని చేగుంట గ్రామంలో గురువారం మండల పశువైద్యాధికారులు పశువులకు గాలికుంటూ వ్యాధి నివారణకు టీకాలు వేశారు. రైతులు తమ పశువులకు విధిగా టీకాలు వేయించాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కూడ తమ శాఖ అధ్వర్యంలో ప్రత్యేక క్యాంప్‌లు ఏర్పాటు చేసి టీకాలు వేస్తున్నట్లు తెలిపారు.

మద్దూరు: మండల పశువైద్యశాఖ అధ్వర్యంలో ఉమ్మడి మండలంలోని నందిపాడ్‌, రెనివట్ల, నాగంపల్లి, పల్లెర్ల, గోకుల్‌నగర్‌ గ్రామాల్లో గురువారం పశువులకు గాలికుంటూ వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారిణి సబిత తెలిపారు.

రోడ్డు బాగు చేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

ధన్వాడ: మండలంలోని కొండ్రోపల్లి, పూసల్‌పాడు, గోటూర్‌కు వెళ్లే బీటీ రోడ్డు గుంతలమయంగా మారిందని, వెంటనే మరమ్మతు చేయాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్‌ మాట్లాడుతూ నాలుగేళ్లుగా లాల్‌కోట చౌరస్తా నుంచి కోయిల్‌సాగర్‌ వరకు బీటీ రోడ్డు కంకరతేలి గుంతల మాయంగా మారడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నరన్నారు. కొండ్రోన్‌పల్లి గ్రామానికి బస్సు సర్వీసు కూడా నిలిపివేశారని దీంతో మూడు గ్రామాల విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పనులు చేపట్టక పోతే స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకుంటామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ నర్సింములు, బాలరాజు, శాంతన్న, అబ్దుల్‌ హమీద్‌, మోహన్‌రాజు, రామప్ప, పద్మారెడ్డి, రాజప్ప పాల్గొన్నారు.

ఎస్పీని సన్మానించిన కాంగ్రెస్‌ నాయకులు



ఎస్పీని సన్మానిస్తున్న మార్కెట్‌ చైర్మన్‌ శివారెడ్డి, నాయకులు

నారాయణపేట: జిల్లా ఎస్పీ డాక్టర్‌ వినీత్‌ జన్మదినం సందర్భంగా గురువారం ఎస్పీ కార్యాలయంలో పేట మార్కెట్‌ చైర్మన్‌ రాంపురం శివారెడ్డి, ఎమ్మెల్యే పీఏ చిట్టెం మాధవరెడ్డితో పాటు కాంగ్రెస్‌ నాయకులు ఎస్పీని శాలువా, పూలమాలతో సన్మానించి జ్ఞాపిక అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో శాంతి భద్రతలు నెలకొల్పడానికి ఎల్లప్పుడూ తమ సహకారం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌ వైస్‌ చైర్మన్‌ కోణంగేరి హనుమంతు, నాయకులు శరణప్ప, సరాఫ్‌ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఫారెస్ట్‌ అధికారి

నారాయణపేట జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్‌ వినీత్‌ను గురువారం నారాయణపేట ఫారెస్ట్‌ అధికారి ప్రసాద్‌ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఫిజియోథెరపీ కేంద్రాన్ని సద్వినియోగించుకోవాలి

దామరగిద్ద: మండల కేంద్రంలోని కేంద్ర ప్రాథమిక పాఠశాలలో ప్రతి మంగళ, గురువారాల్లో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ కార్యక్రమాన్ని ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ కృష్ణారెడ్డి సూచించారు. గురువారం స్థానిక కేంద్ర ప్రాథమిక పాఠశాలలో ఫిజియెథెరపీ సెంటర్‌ను పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను కేంద్రానికి తీసుకొచ్చి మానసిక వైకల్యం నుంచి పరిపక్వత చెందే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎచ్‌ఎం చందుజమాన్‌ ఫిజియోథెరఫిస్ట్‌ శివాని పాల్గొన్నారు.

రూ.15 కోట్లు మంజూరు

అమరచింత: పట్టణంలోని అన్ని వార్డుల్లోని మురుగు కాల్వలు, సీసీ రహదారుల నిర్మాణంతో పాటు ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని మున్సిపల్‌ ఏఈ రామకృష్ణ తెలిపారు. మున్సిపాలిటీలో గురువారం టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్‌తో కలిసి ఆయా వార్డుల్లో చేపట్టాల్సిన పనులను గుర్తించారు. ఈ సందర్భంగా నాగరాజ్‌గౌడ్‌ మాట్లాడుతూ మంత్రి వాకిటి శ్రీహరి అమరచింత మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.15 కోట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. టౌన్‌ హాల్‌, ప్రభుత్వ కార్యాలయాల సముదాయ భవనం, స్టేడియం, వాకింగ్‌ట్రాక్‌, పార్కుల ఏర్పాటు, కూడళ్ల సుందరీకరణతో పాటు పలు అభివృద్ధి పనుల కోసం అధికారులకు నివేదికను పంపించామన్నారు. డీసీసీ కార్యదర్శి ఆయూబ్‌ఖాన్‌, జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర్‌గౌడ్‌, మండల, పట్టణ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్‌ పాల్గొన్నారు.

అమృత్‌ 2.0 పనులు వేగవంతం

ఆత్మకూర్‌: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ.17 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న అమృత్‌ 2.0 పనులు వేగంగా కొనసాగుతున్నాయని వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ రహ్మతుల్లా, మున్సిపల్‌ కమిషనర్‌ చికెన్‌ శశిధర్‌ అన్నారు. గురువారం పట్టణంలో అమృత్‌ 2.0 పథకంలో భాగంగా 1,200 కేఎల్‌ సామర్థ్యం గల ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. నాయకులు పరమేష్‌, తులసీరాజ్‌, శ్రీను పాల్గొన్నారు.

విద్యార్థినికి గోల్డ్‌ మెడల్‌



దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి గ్రామానికి చెందిన విద్యార్థిని పూజారి తులసి ఎంఎస్సీ కంప్యూటర్‌ సైన్స్‌లో గోల్డ్‌ మెడల్‌ సాధించింది. ఈ మేరకు గురువారం పాలమూరు యూనివర్సిటీ 4వ స్నాతకోత్సవ కార్యక్రమంలో గవర్నర్‌ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్‌ అందుకుంది. తులసి గద్వాల కళాశాలలో పీజీ పూర్తి చేయగా, గవర్నర్‌ చేతుల మీదుగా బంగారు పతకం సాధించినందుకు కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆమెను అభినందించారు.

200 రోజులు పని కల్పించాలి

మద్దూరు: ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకొని వ్యవసాయ కూలీలకు ఉపాధిహామీ పథకంలో రోజుకు రూ.920 కూలి చెల్లించాలని, ఏడాదికి 200 రోజులు పనిదినాలు కల్పించాలని, 60 ఏళ్ల పైబడిన వారికి రూ.5వేలు పింఛన్‌ మంజూరు చేయాలని తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్‌ (టీవీవీయూ) ఆధ్వర్యంలో కూలీలు తహసీల్దార్‌ మహేష్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రపంచమంతా ఆహార దినోత్సవాన్ని జరుపుకుంటే తాము మాత్రం ఆకలి రోజు జరుపుకుంటున్నామన్నారు. తమ సమస్యలను పరిష్కరించి తమను ఆదుకోవాలని కోరారు. సంఘం నాయకులు చెన్నప్ప, కవిత, భీములు, పోన్నయ్య, ప్రదీప్‌ పాల్గొన్నారు.

సాంస్కృతిక పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

దామరగిద్ద: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీల్లో ఫోక్‌ డ్యాన్స్‌లో మొదటి స్థానంలో నిలిచి ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాల జీహెచ్‌ఎం సురేష్‌, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. మరింత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో రాణించాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కన్కప్ప, బాల్‌రాజ్‌, రత్నం, రమేష్‌, విజయలక్ష్మి, శిరీష, శంభులింగం పాల్గొన్నారు.

నంబర్‌ ప్లేట్‌ లేకపోతే వాహనం సీజ్‌



కృష్ణా: వాహనాలకు నంబర్‌ ప్లేట్‌ లేకపోతే చర్యలు తప్పవని ఎస్‌ఐ నవీద్‌ సూచించారు. మండలంలోని జాతీయ రహదారిపై గురువారం సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. దాదాపు 25 ద్విచక్ర వాహనాలకు నంబర్‌ ప్లేట్లు లేకపోవడంతో వాటిని సీజ్‌ చేసి స్టేషన్‌కు తరలించారు. వాహనాలకు నెంబర్‌ ప్లేట్లు లేకపోయినా, సరిగ్గా కనిపించకపోయినా వాహనాన్ని సీజ్‌ చేస్తామన్నారు. అలాగే డ్రైవింగ్‌ లైసెన్స్‌, వాహనాలకు సంబంధించిన పత్రాలు కలిగి ఉండాలన్నారు.

కళాశాలలో సౌకర్యాల కల్పన



కోస్గి: కోస్గి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మౌలిక సౌకర్యాలు కల్పించడం హర్షనీయమని కళాశాల ప్రిన్సిపల్‌ నారాయణగౌడ్‌ అన్నారు. శుక్రవారం రూ. 2.20 లక్షలు కడా నిధులతో కడా చైర్మన్‌ వెంకట్‌రెడ్డి, కొడంగల్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి సహకారంతో కళాశాలకు అవసరమైన కంప్యూటర్‌లు, ప్రింటర్‌ , కుర్చీలు, టేబుల్స్‌, బీరువా అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భరత్‌కుమార్‌, వెంకట్రాములు, కేశవులు, శ్రీనివాస్‌, శీనయ్య, వెంకటేష్‌, మాధవి, శైలజ పాల్గొన్నారు.

డిజిటల్‌ లెర్నింగ్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ



కోస్గి రూరల్‌: విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్‌ లెర్నింగ్‌ కార్యక్రమంలో భాగంగా గుండుమాల్‌ మండల కేంద్రంలోని పీయంశ్రీ ఆదర్శ ఉన్నత పాఠశాలలో కోస్గి, గుండుమాల్‌ , కొత్తపల్లి , మద్దూర్‌ మండలాలకు చెందిన ఫిజికల్‌ సైన్స్‌ ఉపాధ్యాయులకు గురువారం శిక్షణ ఇచ్చారు. మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం చేపట్టినట్లు ఆర్పీ మల్లికార్జున్‌ అన్నారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు డిజిటల్‌ లెర్నింగ్‌లో భాగంగా కోడింగ్‌, కోడ్‌బ్లాక్స్‌, రోబోటిక్స్‌, డిజైన్‌ థింకింగ్‌, డిజిటల్‌ సిటిజన్‌ షిప్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కోర్సు డైరెక్టర్‌ రవీందర్‌రెడ్డి , ఎంఆర్పీ శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బకాయి డబ్బులు చెల్లించాలి

ఊట్కూరు: ఉపాధిహామీ కూలీలకు బకాయి కూలీ డబ్బులను వెంటనే చెల్లించాలని సామాజిక కార్యకర్త మహేష్‌గౌడ్‌ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన మండలంలోని బిజ్వార్‌ గ్రామ శివారులో పనిచేస్తున్న కూలీలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మే నెల నుంచి కూలీ డబ్బులను జమ చేయలేదని తెలుపగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. నెలల తరబడి కూలీ డబ్బులు చెల్లించకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో తాయప్ప, నర్సింహ, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

1100 లీటర్ల డీజిల్‌ స్వాధీనం



నారాయణపేట: పట్టణంలో అక్రమంగా తరలిస్తున్న 1100 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు టౌన్‌ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కర్ణాటక నుంచి అర్ధరాత్రి ఎలాంటి పర్మిషన్‌ లేకుండా బొలెరో వాహనంలో డీజిల్‌ తరలిస్తుండగా జిల్లా కేంద్రంలోని ఎర్రగుట్ట వద్ద పట్టుకున్నట్లు పేర్కొన్నారు. డ్రైవర్‌ ఖాజా హుస్సేన్‌ను విచారించగా అబంగాపూర్‌ గ్రామానికి చెందిన చిన్నప్ప వాహనం యజమాని అని తెలుపగా కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

గుట్కా పాకెట్ల స్వాధీనం



మరికల్‌: మాధవరంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన నిషేధిత గుట్కా పాకెట్లను గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఓ వ్యాపారి గత కొంతకాలంగ గుట్కా వ్యాపారం నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఇంటిపై దాడి చేయగా ఆరు బస్తాల గుట్కా పాకెట్లు లభించగా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. పట్టుబడిన గుట్కా విలువ రూ.30 వేలు ఉంటుందన్నారు. ప్రభుత్వ నిషేధిత గుట్కాను విక్రయించినా, సరఫరా చేసినా చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్‌ఐ రాము హెచ్చరించారు.

ఇసుక, మొరం టిప్పర్ల పట్టివేత



మరికల్‌: అక్రమంగా ఇసుక, మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లను పోలీసులు పట్టుకున్నారు. పట్టణంలోని రాకొండ శివారులోని కొయిల్‌సాగర్‌ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌, అలాగే గుట్టల నుంచి అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రెండు టిప్పర్లపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాము తెలిపారు.

మాగనూర్‌: మండలంలోని పెగడబండ గ్రామంలో గోపాల్‌ అనే వ్యక్తి అనుమతి లేకుండా ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వాహన తనిఖీల్లో భాగంగా గ్రామ సమీపంలో ఇసుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకొని పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌ గోపాల్‌, ట్రాక్టర్‌ యజమాని దాసరి నర్సింములు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు.

ముళ్లపొదల తొలగింపు



నర్వ: మండల కేంద్రం నుంచి రాయికోడ్‌ గ్రామం వరకు ఏపుగా పెరిగిన ముళ్ల పొదలను అధికారులు గురువారం జేసీబీతో తొలగించారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్యసాగర్‌ సిబ్బందితో ముళ్లపొదలను తొలగించారు. రహదారికి ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదల వల్ల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్లు ఆయన దృష్టికి తీసుకురావడంతో ముళ్ల పొదలను తొలగించారు. దీంతో రాయికోడ్‌ గ్రామస్తులు చెన్నయ్య సాగర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

జాదరావ్‌పల్లిలో వైద్యశిబిరం



మద్దూరు: మండలంలోని జాదరావ్‌పల్లిలో ఓఎంఐఎఫ్‌ సంస్థ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. సంస్థ కో ఆర్డినేటర్‌ శాంసన్‌, డాక్టర్‌ పృథ్వీల ఆధ్వర్యంలో మహిళలకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. దాదాపు 100 మందికి పైగా మహిళలు పరీక్షలు చేసినట్లు నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కోఆర్డినేటర్‌ నారాయణ, సిబ్బంది కృష్ణ, లాలమ్మ, స్వాతి, శారదమ్మ, సుమిత్ర షాలిని, శాంతకుమారి, పద్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

గుంతలో కూరుకుపోయిన వాహనాలు



మక్తల్‌: మక్తల్‌–నారాయణపేటకు వెళ్లే దారిలో రెండు వాహనాలు రోడ్డుపై కూరుకుపోయాంది. సిమెంట్‌ లోడ్‌తో వస్తున్న లారీ ఒక్క సారిగా గుంతలోకి దిగడంతో అక్కడే కూరుకుపోయింది. అలాగే డీసీఎం వెనుక టైర్లు కూడా రోడ్డులోకి దిగబడడంతో కూరుకుపోయింది. దీంతో ఇతర వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. చివరికి జేసీబీ సాయంతో లారీని బయటకు తీశారు. వర్షాలు, ఏళ్లుగా మరమ్మతు చేయకపోవడంతో పట్టణంలోని బీటీ రోడ్డు అధ్వానంగా తయారైందని, అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.